# తావలచిన కన్య

రంగంమీద హాజరవసే అయ్యారు.

'అయినా పెళ్ళికొడుకువు. సిగ్గూ బిడియం అక్కర్లేదురా' అని హాస్యం పొలకబోస్తూ ఆయన వెనకనే సత్యం మామయ్య.

రత్తమ్మకు నోరు జారింది—

'మాకారా! వీడు రాజేశ్వర్ని చేసుకుంటాడుట' అన్నది.

దీక్షితులు ఏదో చెప్పబోయి ఊరుకున్నాడు—

సుబ్బరామయ్యగారు బుస్సుమన్నారు.

'ఏమిటేమిటి! రాజేశ్వరినా? ఓరెయ్. నీకేం మతిపోయిందా ఏమిట్రా! అయినా నేనుండగా నీకా గొడవెందుకు? నాకా మాత్రం నీపాటి సలక్షణ తెలుసు' అన్నారు.

'అయితే నన్నొక గంగిరెద్దును చేస్తారన్నమాట,' కాస్త వ్యగ్రతపడ్డాడు దీక్షితులు—'అయినా యీ విషయంలో నిర్ణయం చేయవల్సింది నేను. ఇది 20 శతాబ్దం నాన్నా. పదమూడు పద్యాలుకాదు' అన్నాడు.

రత్తమ్మ రంయ్ మంది—

'మాకారా! పాడుకాలం ఎలా మారిందీ!' అన్నది.

'కాదక్కా. కాలేజీగాలి వంటబట్టింది' అన్నాడు మావయ్య.

దీక్షితులు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు; 'వీళ్ళకెలా చెప్పినా అసలు సంగతి' అని.

'రాజమండ్రీ వాళ్ళు నాలుగు వేల పైచిలుకు రాలుస్తారట. అది రైట్ చేసుకుంటే బావుంటుంది' తన నిశ్చయం అదే అన్నారు సుబ్బరామయ్యగారు.

'అబ్బె. అదేమిటండీ. ఆ సంబంధం నాకు నచ్చలేదు. ఆ పిల్లతల్లి వట్టి గయ్యాళి గంపట' అంది రత్తమ్మ.

'అయితేనేమిటి? వాళ్ళింట్లో మనం కూర్చోంగదా ఆవిడతో పోట్లాడానికి. డబ్బు ముఖ్యం. పిల్ల ముఖ్యం...ఏం హాయ్ సత్యం' అన్నారు సుబ్బరామయ్యగారు.

'మరేమిటి లేకపోతే...ఎవడిస్తాడే నాలుగువేలు? నాలుగు వేలంటే మాటలా' అన్నాడు కుశాగ్రబుద్ధిసత్యం—'నీమాటేమిట్రా దీక్షితులూ? లక్షణంగా రాజమండ్రీ పిల్ల రాధాకుమార్ని చేసుకో' అంటూ అక్కగారివైపునించి దృష్టి దీక్షితులువైపు తిప్పాడు.

దీక్షితులు ఏమీ సమాధానం చెప్పలేదు.

రత్తమ్మ మాత్రం ఊరుకోలేదు—

'ఆరు నూరైనా నూరు ఆరైనా ఆ రాజమండ్రీ పిల్ల మనకొద్దండీ; అనార్యపురం పిల్లని చేసుకుందాం' అన్నది భర్తతో.

'నోరుమూసుకో' అన్నాడు సుబ్బరామయ్య. 'అనార్యపురం వాళ్ళసంగతి నీకేం తెలుసే. ఆ పిల్ల పెత్తాతగారి మనవరాలు ఎవడితోనో లేచిపోయిందిట. వారిదగ్గర బంధువుల్లో యింకొక అమ్మాయికి వితంతు వివాహం జరిగింది. ఈ తంతు నీకేం తెలుసూ!'

'మరి ఆ రాజమండ్రీ సంబంధం మాత్రం మంచిదా ఏమిటి! ఆ పిల్ల పెద్ద కాలేజీలో చదివింది. అనేకమంది మగవాళ్ళతో ఆ అమ్మాయికి స్నేహాలుట. మా పిన్నికూతురు చెప్పింది; ఆ సంబంధం వదని. కట్నం తక్కువయినా మరో సంబంధమే మంచిది', రత్తమ్మ నిశ్చయించింది.

'కట్నం తక్కువవడానికి వీలేదు, వీల్లేదు' అన్నారు సుబ్బరామయ్యగారు.

'మధ్యని మీరిద్దరూ ఎందుకయ్యా కొట్లాట. అసలు వాడేమంటాడో ముందది కనుక్కో.' అని బావమరిది సలహా ఇచ్చాడు.

'వాడు నా మాటే వింటాడు' రత్తమ్మ నవ్వింది కొడుకువైపు చూస్తూ.

'లేదు. వాడు నే గీసిన గీటు దాటడు' రీవిగా చూశాడు సుబ్బరామయ్య.

'ఏం నాయనా?' అన్నది తల్లి.

'ఏరా?' అన్నాడు తండ్రి.

దీక్షితులు ఏ సమాధానం చెప్పలేక ఇద్దరివైపు జాలిగా చూశాడు.

'ఏమిటూ మాగనోము?' అన్నాడు మామ.

'నాకిదేం నచ్చలేదు' అన్నాడు దీక్షితులు.

'నీకు నచ్చిందొక్కటేమరి. అయినా తాపట్టిన కుందేటికి మూడేకాళ్ళా? బుద్ధి కాస్త మార్చుకో' అన్నాడు మావయ్య మందలింపుగా.

సుబ్బరామయ్య పైవుత్తరీయంతీసి తలకు చుట్టుకున్నాడు—

'విన్నా బాబూ! యీ అవకాశం దాటితే మరి పైసా రావడం కష్టం. ఇంతకూ నీకు నచ్చిందేమిటి? రాజేశ్వరా?' అంటూ ఓ మెట్టుక్రిందికి దిగాడు.

'అని వేరే చెప్పాలా! అయినా అదెలా నచ్చిందీ అని' అందుకున్నాడు బావమరది సత్యం.

దీక్షితులు ఏమీ చెప్పకుండా నవ్వేశాడు—

'ఆ అమ్మాయికి అందంవుంది. కాని అది మొగుడితో కాపరంచేసే రకంలా నాక్కనిపించలేదు,' అంది రత్తమ్మ.

మావయ్య వెంటనే వకాల్తా పుచ్చుకున్నాడు.

'అసలా అమ్మాయి ముక్కేం బాగులేదక్కా. గెద్దముక్కులావుంది' అన్నాడు.

'గెడ్డంకూడా చిన్నది' రిమార్కు చేసింది రత్తమ్మ.




'నడకన్నా డా ఒంటెనడకలావుంది' మావ అబ్జర్వేషన్.

'గొంతుక బొత్తిగా బొంగురు.' అమ్మ రిసెర్చి.

'అంతేకాదు. కన్యాదాత ఒట్టిమురికి మనిషి. ఇప్పటికప్పుడే ఇరవై సంబంధాలు అందుకే తేలిపోయాయిట.' నాన్న చెప్పిన కబురు

దీక్షితులు యింక పూరుకోలేదు—

'ఔను. అయినా వాళ్లననడం దేనికి? ఈ చూసిన యిరవై సంబంధాలవాళ్ళూ అంతకన్నా మురికివాళ్ళయుండాలి. లేకపోతే వీళ్ళ వితరణబుద్ధి ఏది? ఏ ఒక్కరైనా అందులో విశాలహృదయులైతే ఆ కట్నం గురించి ఖాతర్చేసేవారు కాదు,' అన్నాడు.

'ఆఁ. మా గొప్పసంస్కారివి బయల్దేరావులే' హేళనగా నవ్వాడు మావ.

'అయినా సంస్కారం రమ్మంటే ఎలా వొస్తుంది? మకిలి పట్టిన మనసుల్ని కడిగి వేయడం అంత సులువైన పనికాదు ఇంకా మనదేశం యీ విషయంలో అనేక శతాబ్దాలు వెనకబడి వుంది. ఎంతమందో వుపన్యసిస్తున్నారు. పుస్తకాలు అనేకం పేజీలకు పేజీలు వ్రాసేస్తున్నారు 'సంస్కారం' అంటూ. కాని అసలు సంస్కారం అనేది యింకా మాటల్లోనే దొర్లుతుంది. కాలం మారుతోంది. కాలంతోపాటే మనమూ పురోగమించాలి. కాని మన మనసులోని సంస్కారం రబ్బరు తాడులా ముందుకు సాగినట్టే సాగి యథాస్థానానికి వొచ్చేస్తోంది. అంటూ వుపన్యాసం దంచేస్తూన్న దీక్షితులుకి సుబ్బరామయ్యగారు అడ్డొచ్చారు.

'సరేలే. మాకా చదువంతా ఎందుకుగాని నీ నిశ్చయం ఏమిటో ముందు చెప్పు. రాజేశ్వరినే చేసుకోదల్చుకున్నావా?' అన్నారు.

'ఆ గద్దముక్కు పిల్లనే?' అన్నాడు సత్యం ఆశ్చర్యంగా చూస్తూ.

'అవయ్యారినా! అవన్నెల విసనకర్రనా!' అన్నది రత్తమ్మ భయావహంగా.

'తొండ ముదిరి వూసరవెల్లి అయినట్టుంది పీడి వాలకం' అన్నాడు సత్యం.

అయినా దానికళ్లు వజ్రాల రాళ్లుగానూ! వెండి కొండలాంటి మా నాయన మంచు కొండలా కరిగిపోయాడు. అయినా మనసు మార్చుకోరా బాబూ; చూసి చూసి ఆ బొంగురు గొంతు పిల్లను కంఠానికట్టుకుంటావా! గట్టిపాడివేసి చూసింది రత్తమ్మ

దీక్షితులు తన నిర్ణయం పూర్తి చేసుకున్నాడు.

సుబ్బరామయ్యగారు ఆశగా చూశారు.

'ఇప్పుడు చెప్పు. రాజేశ్వర్ని చేసుకుంటావా? రాధాకుమారినా?' అన్నాడు సత్యం మామయ్య.

'ఇద్దర్నీ కాదు' అన్నారు దీక్షితులు.

రత్తమ్మ కొండంగుకుంది; కొండెక్కిన సుబ్బరామయ్య గభాల్న క్రిందికి పడ్డాడు.

'మా బాబు బంగారు. ఆర్యాపురం పిల్ల ఆదిలక్ష్మి మా కోడలు' అన్నది రత్తమ్మ పొంగిపోతూ.

దీక్షితులు పకపకా నవ్వాడు-

'కాదమ్మా, ఖర్గపూర్ పిల్ల లక్ష్మీకాంతం నీ ముద్దుకోడలు' అన్నాడు. రత్తమ్మ మెత్తగా చితయిపోయింది-

'ఎవరా లక్ష్మీకాంతం?' అన్నది.

'ఎప్పుడు చూశావ్? ఎక్కడ చూశావ్?' అన్నాడు సత్యం మామయ్య.

'ఏమతం? ఏ కులం? ఏ శాఖ??' అన్నారు సుబ్బరామయ్యగారు; దక్షయజ్ఞం వేళ కైలాసం దిగుతూన్న రుద్రమూర్తిలా.

'నేనా అమ్మాయిని ప్రేమించాను,' దీక్షితులు ప్రకటించాడు. సత్యం ముక్కుమీద వేలేసుకున్నాడు.

'దీక్షితులు చెడిపోయాడు. భ్రష్టుడైపోయాడు. ఇదేం వెగటు బుద్ధిరా' అన్నది రత్తమ్మ వొళ్లు తెలియని ఆవేశంలో.

దీక్షితులు కించిత్ కూడా చలించలేదు.

'ఏం; యిందులో పాడేముంది. ఒకరొకరం అర్థం చేసుకుని స్వరతుల్యమైన దాంపత్యం సాగించాలనుకుంటున్నాం. మనసులు కలియడం తప్పా? మనుషులు ఒకరిచేత ఒకరు ఆకర్షింపబడటం తప్పా? ఈ రెండూ అయినప్పుడు పెళ్ళి చేసుకోవడం తప్పా? ఇంతకూ ఏం మతాంతర వివాహం కాదు కులాంతరం కాదు...వాళ్ళనాన్న ఓవర్సీర్ పనిచేస్తున్నాడు. అతనికి బోలెడు పలుకుబడుంది. వాళ్ళింటో అంతా చాలా మంచివాళ్ళు. అన్నిటికన్నా ముఖ్యం అమ్మాయి కల్చర్. చక్కని రూపం. విశేషమైన తెలివితేటలు. మంచి సంస్కారం వుంది సంగీత సాహిత్య విశారద.'

'ఏమేడి సేసేం. శాఖాంతరమేగా?'

'అయితే వొచ్చిన తప్పేమిటి? ఆహార విహారాదులు ఒక్కటై, సజాతీయులూ, సభాషీయులూ అయితే...'

'నో ర్యూమసుకో.' గర్జించారు సుబ్బరామయ్యగారు- సంతోషించాం నీ వివేకానికి. తులసి మొక్కలో దూలగుండాకు పుడుతుందనుకోలేదు. ఇంతకూ వేళా విశేషం. తా వలచినదే...' అన్నారు. ★




స్టేన్స్ శుద్ధమైన కాఫీ

స్టేన్స్ ఎరుపు లేబిలు కాఫీ మీకు గాలి చొరని డబ్బాలలో తాజాగా లభిస్తుంది. అది 3 పౌ. 7 పౌ 14 పౌ. 20 పౌ.ల డబ్బాలలో దొరకును.

దీ యునైటెడ్ కాఫీ సప్లయి కంపెనీ లిమిటెడ్,
కోయంబత్తూరు, దక్షిణ ఇండియా

మహబూబునగర్ ఏజెంట్లు : మెసర్సు ముత్యాలు & సన్సు జనరల్ మర్చంట్సు, మహబూబునగర్ : పశ్చిమగోదావరి డిస్ట్రిబ్యూటర్సు, మెసర్సు శ్రీపాద నరసింహం బ్రదర్స్, జనరల్ మర్చంట్సు, పాలకొల్లు, ఏలూరు.